క్లుప్తంగా

సచివాలయాల్లో ఆధార్ కార్డు అప్‌డేషన్ ఉచితం

మాచర్ల: పట్టణ ప్రజలంతా ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పదేళ్ల తరువాత ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరని తెలిపారు. అన్ని సచివాలయాలు, మీ సేవలు, బ్యాంకులు, పోస్టాఫీసులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల్లో ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కల్యాణ కానుక అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన మిరియాల యాకోబు, మేరీల కుమార్తె దేవమణికి చింతలపూడి ట్రస్టు తరఫున కల్యాణ కానుకను బుధవారం డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వధువుకు బంగారపు ఉంగరంతో పాటు పట్టుచీర, సారెను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



పిడుగురాళ్ల: అనుమతులు లేని విత్తనాల్ని విక్రయిస్తే సహించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో జె.వాసంతి తెలిపారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాల్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవో, వ్యవసాయ శాఖ సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ పట్టణంలోని ఓ షాపులో సర్టిఫికెట్ లేకుండా అమ్ముతున్న పత్తి విత్తనాలను నిలుపుదల చేశామని చెప్పారు. వీటి విలువ రూ. 3,36,548 ఉంటుందని తెలిపారు. రైతులకు అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారుల్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ఎ. శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీఈఏ రిలే నిరాహారదీక్ష

మాచర్ల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణ చిన్ని రామిరెడ్డి, ఎన్. రవి కోరారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని సానుకూలంగా పరిశీలించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తీసుకురావాలని, కాంట్రాక్టు ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల ఉద్యోగ సంఘ నాయకులు సుబ్బాచారి, సుభాని, బాలునాయక్, జ్యోతి, ఆరుముళ్ల నాగేశ్వరరావు, కుర్రి వీరారెడ్డి పాల్గొన్నారు.

7న ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

దాచేపల్లి: మండలంలోని గామాలపాడులో ఈ నెల 7న నాయకురాలు నాగమ్మ నిర్మించిన చెన్నమల్లికార్జునస్వామి ఆలయ పునరుద్ధరణ పనులకు, శ్రీరాజరాజేశ్వరిదేవి సమేత శ్రీమహారాజ రాజేశ్వరస్వామి దేవస్థానం పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ పనుల్నిబుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ జంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గామాలపాడు సమీపంలోని నాగులేరు ఒడ్డున 18 ఎకరాల్లో నాడు పల్నాటి తొలి మహిళా మంత్రి నాయకురాలు నాగమ్మ చెన్నమల్లికార్జునస్వామి దేవాలయాన్ని నిర్మించారని తెలిపారు. దాన్ని పరిరక్షించి పల్నాటి చరిత్రను ప్రజలకు చెప్పేందుకు పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో శివలింగ ప్రతిష్ట, ఏకశిల నాగేంద్రస్వామి విగ్రహంతో పాటు పలు దేవతా మూర్తుల ఉప ఆలయాలు నిర్మిస్తామని తెలిపారు. నాలుగు దిక్కులా గాలి గోపురాలు ఉంటాయన్నారు. వీటిల్లో ప్రధాన రాజ గోపురం ఎత్తు 272 అడుగులు ఉంటుందని ఆయన వివరించారు. ఆధ్యాత్మిక ధ్యాన, యోగా కేంద్రాలు, వేద విద్యాలయం, గోశాల, యాత్రికుల వసతి సముదాయాలు కూడా నిర్మించేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. పల్నాటి చరిత్ర వైభవాల్ని నేటి తరానికి చాటి చెప్పేందుకు మ్యూజియం, గ్రంథాలయం, కల్యాణ మండపం కూడా నిర్మిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రధాన రాజ గోపురం నిర్మాణ శైలితో దేశంలోనే అతిపెద్ద గోపురంగా ప్రసిద్ధికెక్కుతుందని తెలిపారు. శంకుస్థాపనలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ అధికారులు పాల్గొంటారని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, సర్పంచ్ జంగా సురేష్, మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, కౌన్సిలరు షేక్ షరీఫ్, మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు, కమిటీ సభ్యులు బెహరా శ్రీనివాసరావు, గద్దల వేదమణి, మందా బెంజిమెన్, గరిణే పుల్లారావు ఉన్నారు.

పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పేదలకు పెద్దఎత్తున సంక్షేమ పథకాల్ని అందిస్తూ వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అన్నారు. మాచర్ల నియోజకవర్గం కారెంపూడిలో 140వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఆయన నిర్వహించారు. కరెంటు ఆఫీస్ ఎదురుగా ఉన్న వాసవీ నగర్ కాలనీ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత ఎస్సీ కాలనీ, ఇందిరా నగర్ కాలనీ, బ్యాంక్ సెంటర్ ప్రాంతాల్లో గడప గడపకు ఎమ్మెల్యే పీఆర్కే వెళ్లారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి ఓపిగ్గా వివరించి, కరదీపికలు అందించారు. గడప గడపలోనూ పీఆర్కేకు సాదర స్వాగతం లభించింది. ప్రజలు చెప్పిన సమస్యల్ని ఆయన సావధానంగా విని వాటి తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. కారెంపూడి ఒక్క గ్రామంలోనే మొత్తం 21 సంక్షేమ పథకాలతో పాటు ఇతర పథకాలు , నివేశన స్థలాలు వగైరా ద్వారా మొత్తం రూ.23,67,69,329 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు ఎమ్మెల్యే పీఆర్కే వివరించారు. కళ్ల ముందు అభివృద్ధి సంక్షేమం కనబడు తుంటే.. టీడీపీ మళ్లీ మేనిఫెస్టో రూపంలో మళ్లీ మోసపూరిత, దగాకోరు ప్రచారాలకు దిగిందని, ప్రజలెవరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా ఇలాగే హామీలిచ్చారని, తర్వాత వాటిని నెరవేర్చలేదని గుర్తు చేశారు. టీడీపీ దుష్ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పీఆర్కే సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాబాయి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, జెడ్పీటీసీ సభ్యుడు షేక్ షఫీ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రహ్మణ్యం, బొమ్మిన అల్లయ్య, వైస్ ఎంపీపీ గుండెబోయిన అమృత లక్ష్మీ, యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, గుండెబోయిన శివ, దినకర్, మర్రి శేషయ్య, వార్డు మెంబర్ కాలె రాంబాబు, సతీష్, మైలా ఆనందరావు, పార్టీ నాయకులు కరాలపాటి సుబ్బారావు, గుండా శ్రీనివాసరావు, గుండా నరసింహారావు, చీతిరాల కోటేశ్వరరావు, సూరె సుబ్రహ్మణ్యం, పాతూరి రామిరెడ్డి, ఆశం విజయభాస్కరరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు అంతరగడ్డ ఏసోబు, షేక్ ఆరీఫ్, వేముల లింగయ్య, చల్లా ప్రసాద్, కిల్లా కాశి, కొమెర పిచ్చయ్య, బత్తుల బైరాగి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



జేసీబీని నడుపుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంటలో రూ. 25లక్షలతో సీసీ రోడ్డుకు బుధవారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. కండ్లకుంట గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నాలుగేళ్లలో రూ. 18కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. మండాది నుంచి కొత్తపుల్లారెడ్డి గూడెం వరకు 19 కి.మీ. రోడ్డును రూ. 20కోట్లతో పూర్తి చేశామని తెలిపారు. పల్నాడు ప్రాంతం మీదున్న అభిమానంతో సీఎం జగన్ వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లోనూ కలసికట్టుగా పనిచేసి ఆయనకు మద్దతు పలకాలని కోరారు. చంద్రబాబునాయుడు మహానాడులో అస్పష్టమైన హామీల్ని ఇచ్చారని, ప్రజల్ని మరోసారి మోసం చేసేందుకే ఆయన కుయుక్తులు పన్నుతున్నాడని చెప్పారు. టీడీపీ కుట్రల్ని సమష్టిగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఈడెబోయిన పున్నమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెల్లి వెంకట లక్ష్మారెడ్డి, మోదుగుల వెంకటరెడ్డి, తంగిరాల శివారెడ్డి, పిన్నెల్లి లక్ష్మారెడ్డి, నర్రావుల అయ్యన్న, జంగిలి శ్రీనివాసరావు, అమరయ్య పాల్గొన్నారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం

- ధూమపానం వద్దు– ఆరోగ్యం ముద్దు
- జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



ర్యాలీలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, వైద్యులు



ముప్పాళ్ల పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు జయకృష్ణ, వైద్య సిబ్బంది

పిడుగురాళ్ల: పొగాకు వాడకం ప్రాణాంతకమని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వాడకం ప్రమాదకరమని, క్యాన్సర్ వంటి ప్రాణాంతకరమైన వ్యాధులు వస్తాయని తెలిపారు. ఊపిరితిత్తులు పాడైపోయి పలు వ్యాధులకు కారణమై ప్రాణాలకు ముప్పు కలుగుతుందని చెప్పారు. పొగాకును విడిచి ప్రాణాల్ని రక్షించుకోవాలని ఆయన సూచించారు. పొగాకు వాడకంతో తలెత్తే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు కె. ప్రభావతి, రమాదేవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్ల: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, పొగాకు వాడకం జీవితం బుగ్గిపాలు చేస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పొగాకు దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యంగా యువత పొగాకు ఉత్పత్తుల వాడకం హాబీగా మారిపోయిందని, దీనిపై వచ్చే అనారోగ్యాల గురించి వివరించాలని సూచించారు. అనంతరం వైద్యసిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు ఏ.పీటర్ డానియేల్, నాగమల్లేశ్వరరావు, జోస్పిన్‌రాణి, భవానీకుమారి, ఫార్మాసిస్టు రాజ్యలక్ష్మి, ఏఎన్ఎంలు అన్నామణి, జ్యోతి, వెంకటరత్నం, నాగముని, పద్మ, శోభ, వెంకాయమ్మ పాల్గొన్నారు.

మాచవరం: పొగాకు నుంచి తయారు చేసే చుట్ట, బీడీ, సిగరెట్ తాగడం వల్ల ఊపిరితిత్తులు పాడైపోయి క్యాన్సర్‌కు కారణమవుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రసాదరావు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువని తెలిపారు. పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్ వస్తుందని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నేరమన్నారు. పొగ తాగే వారి నుంచి గర్భవతులు, చిన్న పిల్లలు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పట్టాభి, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభాకర్, చిన్నమ్మ, సురేష్, స్టాఫ్ నర్సు శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలక సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి



సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతున్న బోయ రఘురామిరెడ్డి



పాల్గొన్న వైస్ చైర్మన్ పోలూరి, కౌన్సిలర్లు

- మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి
- రూ. 61లక్షలతో ఐదు ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆమోదం
- 18 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం
- సీఎం జగన్ ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ తీర్మానం

మాచర్ల:పురపాలక సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి తెలిపారు. పురపాలక సంఘ కౌన్సిల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలోని ఐదు ప్రాంతాల్లో మరుగుదొడ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ. 61లక్షలతో నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సిఫార్సులతో బస్టాండ్ సెంటర్, నెహ్రూనగర్, ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్, ఎస్సీ కాలనీ కొమ్మళ్ల కాలువ, పోలీసు క్వార్టర్స్ లైన్ వద్ద మరుగుదొడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ మదార్ సాహెబ్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు తెలపాలని కోరారు. తూర్పు బావి ప్రాంతంలోని వాటర్ ప్లాంటు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. పలు అంశాల్ని కౌన్సిలర్ గట్ల అరుణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. సీఎం జగన్ పాలన నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అభినందనలు తెలుపుతూ ఏకగ్రీవంగా కౌన్సిల్ తీర్మానం చేసింది.

పలు అంశాలకు ఆమోదం

మొత్తం 18 అంశాల్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. వివిధ అభివృద్ధి పనులు, చలువ పందిళ్లు, డంపింగ్ యార్డు దగ్గర, రహమానియా మసీదు ప్రాంతంలో రోడ్ల నిర్మాణాన్ని ఆమోదించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వివిధ పనులకు కలెక్టర్ నిధులు మంజూరు చేయగా, ఆయా వార్డులలో పనులు చేయడానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 14వ ఆర్థిక సంఘం నిధుల కింద మంజూరైన రూ. 35.77లక్షలతో చేపట్టనున్న పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సీసీరోడ్లు, పలు పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు రామాంజనేయ రెడ్డి, షేక్ కరీముల్లా, మందా సంతోష్, మాచర్ల చిన ఏసోబు, జగన్నాథం సురేష్, వేల్పుల గురవయ్య, పోలా శ్రీను, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఎం. శ్రీనివాసరావు, మున్నా మురళి, బత్తుల నరసింహారావు, షేక్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ ఈ.వి. రమణబాబు, కో– ఆప్షన్ మెంబర్ అనంతరావమ్మ, అల్లి జీవన్, ఏఈ శ్యామ్యూల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

గురజాల : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని లైబ్రేరియన్ హిమ భార్గవి బుధవారం తెలిపారు. శిబిరంలో చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. పుస్తక పఠనం, ఆటపాటలతో విద్య అభ్యసనంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా చూడాలనే ఆలోచనతోనే ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని విద్యార్థులంతా ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

చిన్నారి గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



మాచర్ల: పేదలకు సాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ముస్లిం సేవా సమితి అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. పట్టణంలోని ఓ చిన్నారికి గుండె ఆపరేషన్ నిమిత్తం బుధవారం ఆయన రూ. 15వేలు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేదలకు సాయమందిస్తున్నట్లు చెప్పారు. చిన్నారికి ఆర్థిక సాయం చేసేందుకు దాతలు ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముస్లిం సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ షేక్ రహమాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజుపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అనుపాలెం సమీపంలోని కోల్డ్ స్టోరేజీ వద్ద గుంటూరు–మాచర్ల రహదారిపై బుధవారం జరిగింది. మండలంలోని దేవరంపాడుకు చెందిన జెల్లి కోటేశ్వరరావు, అరుణ దంపతుల కుమారుడు కార్తిక్(17) అనుపాలెం సమీపంలోని హాలో బ్రిక్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. దేవరంపాడులో విగ్రహ ప్రతిష్ఠకు బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్‌ఐ ఎం. నారాయణ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

‘క్లీన్ పిడుగురాళ్ల’ సాకారమే లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



వార్డులో సమస్యలను చైర్మన్‌కు వివరిస్తున్న కౌన్సిలర్ శ్రీరంగ రజని

పిడుగురాళ్ల: క్లీన్ పిడుగురాళ్ల దిశగా అధికారులు విధులు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి పట్టణంలో రోడ్ల పైకి నీరు చేరిందని, వచ్చే వర్షాకాలానికి గానూ ఇప్పటి నుంచే డ్రైనేజీల్ని శుభ్రం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. హోటల్స్ ఉన్న ప్రాంతాల్లో దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు డ్రెయిన్లను శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవిని ఆదేశించారు. ప్రజారోగ్యం కోసం వ్యర్థ పదార్థాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. 12వ వార్డులోని ఎర్రవాగుకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డును మున్సిపల్ సాధారణ నిధులతో ఏర్పాటు చేసేందుకు అజెండాలో పొందిపరిచినట్లు చెప్పారు. 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్ కుమార్ మాట్లాడుతూ మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా మెయిన్ రోడ్డుపై డివైడర్‌ను తొలగించడంతో ట్రాఫిక్ జాం అయ్యి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నిత్యం 2,200 మంది విద్యార్థులు వచ్చే ప్రాంతం కావడంతో డివైడర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. రోడ్డు విస్తరణ పనులు మధ్యలో ఆపడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీనికి కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు జవాబు ఇస్తూ విస్తరణ పనులపై కొందరు కోర్టును ఆశ్రయించారని, ఉత్తర్వులు రాగానే పూర్తి చేస్తామని తెలిపారు. స్కూల్ వద్ద డివైడర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ వార్డుల్లోని సమస్యల్నికౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరరెడ్డి, కొక్కెర శ్రీను, అన్నం పద్మావతి, శ్రీరంగ రజని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్, కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యనారాయణ, వైస్ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్ జెలాబ్దిన్ పాల్గొన్నారు.

భూ సేకరణలో అవినీతి చేసే కర్మ పట్టలేదు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో 7,761 మంది పేదల ఇళ్ల పట్టాల కోసం ప్రభుత్వ భూమి 90.68 ఎకరాలు, ప్రైవేట్ భూమి 119.21 ఎకరాలు కొనుగోలు చేసి పంపిణీ చేశామని, భూసేకరణలో అవినీతి చేసే కర్మ తనకు పట్టలేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో హోదాలో మంత్రి అంబటి హాజరయ్యారు. 7వ వార్డు జనసేన కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ మురుగునీటి శుద్ధి కర్మాగారం నిమిత్తం సేకరిస్తున్న భూమి ఎవరి పేరుపై ఉంది? గతంలో ఎవరి పేరుపై ఉందంటూ ప్రస్తావించగా.. కమిషనర్ కొలిమి షమ్మీ వివరణ ఇచ్చారు. పట్టణంలో రెండు వైపులా వచ్చే అవుట్‌ఫాల్ కలిసే చోట మురుగు నీటి శుద్ధి కర్మాగారానికి గాను నిర్మలానగర్ ఏరియాలో సర్వే నంబర్ 77/2లో 0.24 ఎకరాలు, 85/3లో 2.24 ఎకరాలు, 87/బీ2లో 1.52 ఎకరాలు వెరసి నాలుగు ఎకరాలు కావాల్సి ఉందన్నారు. అక్కడ నిర్మాణానికి అనువుగా లేదని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించడంతో ప్రైవేట్ భూమి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ విలువ ప్రకారం రూ.8.88 కోట్లకు ప్రభుత్వ గ్రాంట్‌తో కొనుగోలు చేసేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు. జాయింట్ కలెక్టర్ పరిశీలించి ధర రికమండ్ చేస్తారని, తరువాత కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వెళుతుందని చెప్పారు. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు పంపుతుందని, దీనిలో భూసేకరణకు సంబంధించిన అంశం మొత్తం రెవెన్యూ యంత్రాంగం చూస్తుందని తెలిపారు. కౌన్సిలర్ సుమన్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేసేందుకు యత్నించగా మంత్రి అంబటి రాంబాబు జోక్యం చేసుకొని మాట్లాడారు. ఎన్నో ఎకరాలు భూసేకరణ చేశామని, నేరుగా రైతుల ఖాతాల్లో నగదు వేశామన్నారు. భూములు ఆ రోజుకి ఎవరి తరఫున, ఎవరి పేరుమీద రిజిస్ట్రేషన్ ఉందో వాటి ప్రకారం డబ్బులు వేస్తామని చెప్పారు. దీనిలో ఏదో అవినీతి జరిగింది..అన్యాయం జరిగిందని బురదజల్లే కార్యక్రమాలు బయట చేసుకోండని చెప్పారు. దీనిలో అంబటి రాంబాబు అవినీతి చేశాడని, రూ.8.88 కోట్లు కాజేశాడని కొన్ని పత్రికలు రాస్తున్నాయని, వాటిని లెక్కచేయనని స్పష్టం చేశారు. భూసేకరణ అంతా రెవెన్యూ యంత్రాంగం చేసుకుంటుందని, ఎవరి పేరుతో ఉంటే వారి ఖాతాలో డబ్బులు పడతాయని వివరించారు. నియోజకవర్గంలో 119.21 ఎకరాలు భూసేకరణ చేసి పేద ప్రజానీకానికి పట్టాలు ఇచ్చామన్నారు. ఎక్కడన్నా అవినీతి జరిగితే నిరూపించండంటూ సవాల్ విసిరారు. అనంతరం 31వ వార్డు కౌన్సిలర్ తురకా మేరీగ్రేస్ మాట్లాడారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన అవసరం




బిందు సేద్యంపై రైతులతో మాట్లాడుతున్న గురజాల ఉద్యాన శాఖాధికారి మోహన్

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) యంత్ర పరికరాల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గురజాల ఉద్యానశాఖాధికారి వై.మోహన్ తెలిపారు. రెంటచింతలలో రైతులు సాగు చేస్తున్న మామిడి, సీతాఫలం, కొబ్బరి తదితర పంటల్ని బుధవారం ఆయన పరిశీలించారు. బిందు సేద్యం వల్ల కలిగే ప్రయోజనాల్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి సౌలభ్యం లేని ప్రాంతాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై యూనిట్లను అందజేస్తోందన్నారు. ఐదు ఎకరాల్లోపు చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఐదు ఎకరాల నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 75 శాతం, 10 ఎకరాల కన్నా ఎక్కువ ఉన్న రైతులకు రూ. 4 లక్షల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని వివరించారు. ఈ విధానం ద్వారా 20 నుంచి 30 శాతం పంట దిగుబడి అధికంగా వస్తుందని చెప్పారు. సాగులో వచ్చిన మార్పుల్ని రైతులు గమనిస్తూ, మెలుకువలు పాటించడం వల్ల ఎక్కువ లాభం పొందవచ్చని సూచించారు. నీటి సంరక్షణ పద్ధతుల్ని పాటించాలని చెప్పారు. బిందు సేద్యం పరికరాల అవసరమైన రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో పేర్లను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పండ్ల మొక్కల పెంపకంలో భాగంగా బ్రెజిల్ స్వీట్ ఆరెంజ్, తైవాన్ జామ, సీతాఫలంలో ఎన్ఎంకె–1 వంటి రకాలు సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని రైతులకు సూచించారు. ఆసక్తి కలిగిన రైతులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల కోసం స్థానిక అధికారుల్ని సంప్రదించాలని తెలిపారు. సమూహాలు (గ్రూపులు)గా ఏర్పడి పంటలు సాగు చేసిన వారికి ప్రభుత్వ పథకాలలో అధిక ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రైతులు బోయపాటి ఇన్నారెడ్డి, వెన్నా న్నారెడ్డి, వీఏఏలు శంకర్ నాయక్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

రైల్వే గేట్ వైర్ కట్


- రెండు గంటల సేపు నిలిచిన ట్రాఫిక్
- తరచూ అంతరాయంతో వాహనదారులకు అవస్థలు



మరమ్మతులు నిర్వహిస్తున్న రైల్వే సిబ్బంది

పిడుగురాళ్ల: రైల్వే గేట్ పోల్ వైర్లు తెగిపోవడంతో సుమారు రెండు గంటల పాటు పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. జానపాడు రోడ్డులో ఉన్న రైల్వే గేట్ వద్ద బుధవారం ఉదయం 9 గంటల నుంచి సుమారు 11 గంటల వరకు రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక వైపు రైళ్ల రాక పోకలతో, మరో వైపు నిలిచిపోయిన వాహనాలతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వాహన దారులు రైల్వే గేట్ దాటకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కారంపూడి నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రేల్వే గేట్ వద్దనే పిడుగురాళ్ల ప్రయాణికుల్ని దించి తిరిగి అక్కడి నుంచి వెనుదిరిగాయి. మొత్తం మీద రెండు గంటల తర్వాత మరమ్మతులు పూర్తవ్వడంతో ట్రాఫిక్‌ను వదిలారు. ఇక్కడ తరచూ రేల్వే గేట్ మరమ్మతులకు గురికావడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దేశ పౌరులంతా సమానులే..



నకరికల్లు: రాజ్యాంగం ప్రకారం దేశ ప్రజలందరికీ సమాన హక్కులున్నాయని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి ఎన్. నిరీక్షణ తెలిపారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కండ్లకుంట ఎస్సీ కాలనీలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్–17 ప్రకారం అంటరానితనం నేరమని తెలిపారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రాథమిక హక్కులు కల్పించిందని, వాటికి భంగం కలిగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. షెడ్యూల్ కులాల వారిని కించపరచడం నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్. సురేష్, ఏవో దేవదాసు, ఈవోపీఆర్డీ గిరిధర్, విద్యుత్ ఏఈ రూపస్ దానియేల్, ఏఎస్ఐ కోటేశ్వరరావు, కంఠమనేని కోటయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.